సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 24 । నవంబర్ । 2023

I



అభివృద్ధిలో అలం'పూర్'

అలంపూర్ నియోజకవర్గం రాష్ట్ర చిత్రపటం లోనే కాకుండా అభివృద్ధిలో వెనకబడింది.

వివరాలు IIలో ▸



గుర్తుతోపాటు ఫొటో

ఓటర్లు ఓటు వేసే సమయంలో ఇబ్బంది పడ కుండా అభ్యర్థి ఫొటో సైతం ముద్రిస్తున్నారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం 32.4 /21.8

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు పడవచ్చు.

ఆదర్శ కేంద్రాలు..

జిల్లాలో మోడల్ పోలింగ్ కేంద్రాలు



నాగర్‌కర్నూల్‌లోని మోడల్ పోలింగ్ కేంద్రం

- వందశాతం పోలింగ్ నమోదే లక్ష్యం
- మహిళా, యువజన, దివ్యాంగులకు ప్రాధాన్యం
- ఓటర్లను ఆకట్టుకునేలా సుందరీకరణ, మౌలిక వసతులు
- ఏర్పాట్లపై అధికారులు కసరత్తు

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదే లక్ష్యంగా ఎన్నికల సంఘం సరికొత్త విధానాలకు శ్రీకారం చుట్టింది. ఓటర్లను ఆకర్షించేలా 36 మోడల్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. గత ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా.. ఈసారి యువత, దివ్యాంగులకు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కేటగిరీల్లో ఎక్కువ మంది ఓటర్లు కలిగిన కేంద్రాలను మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాల వివరాలను సిద్ధం చేసిన అధికార యంత్రాంగం.. వాటిలో మౌలిక వసతులు కల్పించే దిశగా కసరత్తు చేస్తోంది. ఎన్నికల పోలింగ్ జరిగే ముందు రోజున వాటిని సుందరీకరిస్తారు.

మహిళా ఓటింగ్ శాతం పెంచడానికి..

మహిళా ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశంతో 2018 ఎన్నికల్లో ఎన్నికల సంఘం నియోజకవర్గానికి ఒక మహిళా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వీటితో సత్ఫలితాలు రావడంతో ఈసారి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 15 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే అవసరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల్లో బాలింతలు తమ పిల్లలకు పాలు పట్టేందుకు ఫీడింగ్ గదులు ఏర్పాటు చేయనున్నారు. మహిళలు క్యూలో నిల్చొని ఇబ్బందులు పడకుండా కుర్చీలను ఏర్పాటు చేస్తారు. చూడగానే ఆకట్టుకునేలా స్వాగత తోరణాలతో ముస్తాబు చేస్తారు. ఈ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అంతా మహిళాలే ఉండనున్నారు.

యువత కోసం..

యువ ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను మోడల్‌గా తీర్చిదిద్దనున్నారు. వీటిల్లో యువ ఓటర్లు ఓటేస్తారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మూడు ఏర్పాటు చేయనున్నారు. యువతను ఆకట్టుకునేలా కేంద్రాలను అలంకరించడంతో పాటు తగు వసతులు కల్పించనున్నారు. ఈ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంతా యువతే ఉండనున్నారు.

దివ్యాంగుల కోసం మూడు..

దివ్యాంగ ఓటర్ల కోసం జిల్లాలో మూడు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటిని ముస్తాబ్ చేయడంతో పాటు దివ్యాంగులు సురక్షితంగా వచ్చి వెళ్లేలా ర్యాంపులను నిర్మించనున్నారు. వీల్‌చైర్లను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యేకంగా సహాయకులను నియమిస్తారు. ఈ కేంద్రాల్లో దివ్యాంగ ఉద్యోగులే ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించనున్నారు.

ఆకర్షణీయంగా..

2018లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈసారి నియోజకవర్గానికి ఐదు చొప్పున 15 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా అన్ని విభాగాలకు సంబంధించి మోడల్ ఫర్ ఆల్ పోలింగ్ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూలు 5, అచ్చంపేట 5, కొల్లాపూర్‌లో 5 చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఓటర్లు క్యూలో నిలబడకుండా కూర్చునేందుకు వీలుగా కుర్చీలను అందుబాటులో ఉంచుతారు. అలాగే తాగునీటి వసతి కల్పిస్తారు. పోలింగ్ రోజు షామియానాల ఏర్పాటుతో పాటు రంగురంగుల కాగితాలు, అరటి ఆకులతో ముస్తాబు చేస్తారు. ఓటర్లకు పువ్వులు ఇచ్చి స్వాగతం పలుకుతారు.

మహిళా పోలింగ్ కేంద్రాల వివరాలు..

- తిమ్మాజిపేట 29వ పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్
- బిజినపల్లి 52వ పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్
- నాగర్‌కర్నూల్ 113వ పోలింగ్ కేంద్రం, కాకతీయ టెక్నో స్కూల్
- తెలకపల్లి185వ పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్
- తాడూరు 251వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్
- అచ్చంపేట 101వ పోలింగ్ కేంద్రం, బాలికల జూనియర్ కళాశాల
- ఉప్పునుంతల 73వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- వంగూరు 18వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- తుర్కలపల్లి 13వ పోలింగ్ కేంద్ర, ప్రైమరీ స్కూల్
- మన్ననూర్ 224వ పోలింగ్ కేంద్రం, పీటీజీ పాఠశాల
- వీపనగండ్ల 161వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- వీపనగండ్ల 162వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- వీపనగండ్ల 163వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- వీపనగండ్ల 164వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్
- వీపనగండ్ల 165వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్

యూత్ కోసం..

- తాడూరు 247వ పోలింగ్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల
- అచ్చంపేట 106వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- కొల్లాపూర్ సెగ్మెంట్‌లో 123వ పోలింగ్ కేంద్రం, తెలరాళ్లపల్లితండా ప్రైమరీ స్కూల్

దివ్యాంగుల కోసం..

- నాగర్‌కర్నూలు 103వ పోలింగ్ కేంద్రం, జెడ్పీ హైస్కూల్
- అచ్చంపేట 89వ పోలింగ్ కేంద్రం, బాలుర ఉన్నత పాఠశాల
- కొల్లాపూర్ 244వ పోలింగ్ కేంద్రం, శ్రీసత్యసాయి విద్యావిహార్

మోడల్ పోలింగ్ కేంద్రాలు..

- మరికల్ 3వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్
- గంగారం 69వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- నాగర్‌కర్నూలు 111వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- తెలకపల్లి 187వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్
- తాడూరు 253వ పోలింగ్ కేంద్రం, ప్రైమరీ స్కూల్
- అచ్చంపేట 103వ పోలింగ్ కేంద్రం, బాలికల ఉన్నత పాఠశాల
- లింగాల 203వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- వంగూరు 19వ పోలింగ్ కేంద్రం, జూనియర్ కళాశాల
- చారకొండ 9వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- బల్మూర్ 169వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- పెద్దకొత్తపల్లి 17వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- పెంట్లవెల్లి 204వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్
- మాచుపల్లి 59వ పోలింగ్ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాల
- అమరగిరి 262వ పోలింగ్ కేంద్రం ప్రైమరీ స్కూల్
- పాన్‌గల్ 115వ పోలింగ్ కేంద్రం, హైస్కూల్

కర్ణాటకలో కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది

- మక్తల్ రెవెన్యూ డివిజన్‌కు కృషి
- నారాయణపేట వరకు ఫోర్‌లైన్ రోడ్డు
- ఆత్మకూర్‌లో వందపడకల ఆస్పత్రి ఏర్పాటు
- మక్తల్ రోడ్‌షోలో మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నారాయణపేట/ మక్తల్: ఇక్కడి నుంచి కర్ణాటక ఐదు కిలో మీటర్ల దూరమే.. ఎమ్మెల్యే రామన్న నాలుగు బస్సులు ఏర్పాటు చేస్తాడు.. అందరూ వెళ్లి కర్ణాటకలో చూడండి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ పోయిందా లేదా అనేది తెలుసుకోండి.. తెలంగాణలో కాంగ్రెస్ వస్తే కరెంట్ పోవడం ఖాయమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. అసలు కాంగ్రెసోళ్లు కరెంట్ గురించి మాట్లాడొచ్చా? వాళ్ల హయాంలో కరెంట్ ఎట్లా ఉండే తెలవదా? ఎవరైనా గ్రామాల్లో చనిపోతే ఇదే ఎమ్మెల్యేకు ఫోన్ చేసి అన్నా అంత్యక్రియలు అయిపోయినయ్.. కరెంట్ లేదు.. బోర్లు, బాయికాడ స్నానాలు చేయాలి. ఒక్క 15 నిమిషాలు కరెంటివ్వన్నా అని అడిగలేదా? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్తల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. నాకైతే మీ జోష్ చూస్తుంటే.. రామన్న గెలిచిపోయినట్లే ఉంది.. గెలిచిపోయిండా.. పక్కానా.. హండ్రెడ్ పర్సెంటా.. టిక్ పెట్టుకోవచ్చా.. కేసీఆర్‌కు చెప్పొచ్చా.. అంటూ మంత్రి కేటీఆర్ అనడంతో జనమంతా కేరింతలు కొట్టారు. మక్తల్‌కు రాగానే ఎమ్మెల్యే రామన్న నన్ను నాలుగు విషయాలు అడిగిండు.. అన్నా ఇది వరకు మున్సిపాలిటీలు చేసినవ్.. ఇప్పుడు మా మక్తల్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని, ఆత్మకూర్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మించాలని, భూత్పూర్ రిజర్వాయర్ కాల్వలు బాగు చేయాలని, నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీల్లో స్టేడియాలు, ఊట్కూర్‌లో నూతన బస్టాండ్, మక్తల్– నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు, చంద్రగఢ్ కోటను పర్యాటక కేంద్రం చేయాలని, గిరిజన తండాలకు కొత్త పంచాయతీ భవనాలు నిర్మించాలని కోరారని మంత్రి వివరించారు. టైం ఎక్కువ లేదు.. మా తమ్ముళ్లను కోరుతున్నా రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాలి. సోషల్ మీడియాను నమ్మకండి.. అందులో వచ్చేవి అంతా గాలి కబుర్లు.. వచ్చేది బీఆర్ఎస్ సర్కారే అంటూ కార్యకర్తలు, నాయకులకు భరోసానిచ్చారు. నందిమల్ల నుంచి ధర్మాపూర్‌కు రోడ్డు, ఆర్ఎస్ఎస్ సెంటర్లు.. ఇవన్నీ చిన్న చిన్న పనులని, రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటే ఆ పనులన్నీ చేద్దామని చెప్పారు. మక్తల్ గులాబీమయంగా మారిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి ఉమ్మడి జిల్లా సభ్యులు చిట్టెం సుచరితరెడ్డి, మక్తల్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో రోడ్‌షోకు తరలివచ్చిన గులాబీ శ్రేణులు

డిసెంబర్ 31లోగా సీఎంఆర్ బియ్యం అందించాలి



మిల్లర్లతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

- రాష్ట్రంలోనే చివరి స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా
- గడువులోగా వందశాతం లక్ష్యాన్ని పూర్తిచేయాలి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్

నాగర్‌కర్నూల్: 2022–23 సంవత్సరానికి సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని డిసెంబర్ 31వ తేదీలోగా ఎఫ్‌సీఐకి అందించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో మిల్లర్లు, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో 109 మిల్లులకు 2,99,663 మెట్రిక్ టన్నుల ధాన్యం అందించగా.. మిల్లుల నుంచి 2,15,098 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉందన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 45,645 మెట్రిక్ టన్నులు (23శాతం) బియ్యం మాత్రమే మిల్లర్లు అందించడంతో రాష్ట్రంలోనే జిల్లా చివరి స్థానంలో నిలిచిందని మిల్లర్లపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 31 వరకు సీఎంఆర్ గడువు పెంచిందని, గడువులోగా 1,55, 953 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలి..

సీఎంఆర్ బియ్యానికి సంబంధించి మిల్లర్లు వ్యవపట్టికలు సరిచూసుకోవడంతో పాటు అధికారులు ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. 60నుంచి 80శాతం ఉన్న మిల్లులు వందశాతం పూర్తిచేసి ఎఫ్‌సీఐకి అప్పగించాలని తెలిపారు. సీఎంఆర్ పూర్తి చేసిన మిల్లర్లతో షేరింగ్ చేసుకుని నిర్దేశిత గడువులోగా వందశాతం అందించాలని బకాయి మిల్లర్లకు సూచించారు. అదేవిధంగా 2021 యాసంగికి సంబంధించి 6,900 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వని మిల్లులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

రోజుకు 2వేల టన్నుల బియ్యం అందించాలి..

కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సీఐ రాష్ట్రం నుంచి 20లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ తీసుకునేందుకు అనుమతిచ్చిందని కమిషనర్ తెలిపారు. మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ బియ్యాన్ని అందించేందుకుగాను రోజుకు 2వేల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించాలని ఆదేశించారు. రాష్ట్ర సివిల్ సప్లైకి రోజుకు 500 టన్నుల బియ్యం అందేలా చూడాలన్నారు. బియ్యాన్ని సకాలంలో అందించని మిల్లులకు ఈసారి వర్షాకాలం ధాన్యాన్ని అందించకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం నెల్లికొండ సత్యసాయి బారాబైల్డ్ రైస్‌మిల్లును కమిషనర్ తనిఖీ చేశారు. డీఎస్ఓ స్వామి, డీఎం సివిల్ సప్లై బాలరాజ్, ఏఎంఓ రాజేందర్, డీటీలు, జిల్లా మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి రవి, నవీన్, హకీం రాజేష్, ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ



అచ్చంపేటలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ఉదయ్‌కుమార్

- ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్

అచ్చంపేట: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం అచ్చంపేట జేఎంజే పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాలెట్ షీట్ తయారీలో సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, గుర్తుల ఏర్పాటు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ప్రతి అంశాన్ని సీసీ నిఘాలో నిర్వహించాలని, ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పొలిటికల్ పార్టీల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈవీఎంల పనితీరుపై పరిశీలన చేపట్టి అందరికీ పూర్తి స్థాయిలో నమ్మకం కలిగించాలన్నారు. ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్స్ ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. చెంచు పెంటల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని, ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి గోపీరాం పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ పక్కాగా చేపట్టాలి

కొల్లాపూర్: ఎన్నికల నిర్వహణ పక్కాగా చేపట్టాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. కొల్లాపూర్ ప్రభుత్వ పీజీ కళాశాలలో నియోజకవర్గానికి సంబంధించిన 269 ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ షీట్ల అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూంల నిర్వహణపై రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్‌తో చర్చించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ నాగరాజు, ఏఈ ఆర్ఓ శ్రీకాంత్ ఉన్నారు.

మార్పు కోరుకుంటున్న తెలంగాణ ప్రజలు

- ఫాంహౌస్‌లో కూర్చొని పాలన చేయలేరు
- ఏఐసీసీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్



మాట్లాడుతున్న జైరాం రమేశ్

స్టేషన్ మహబూబ్‌నగర్: బుల్లెట్ ప్రూఫ్ లాంటి ఫాంహౌస్‌లో కూర్చొని పాలన చేయలేరని, తెలంగాణలో తొమ్మిదేళ్ల పాటు సీఎం సచివాలయానికి వెళ్లకపోవడం విడ్డూరంగా ఉందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఆకాంక్షల కోసం తెలంగాణ ఏర్పడిందో పదేళ్లు అయినా ఇప్పటికీ నెరవేరలేదని, ప్రత్యేక రాష్ట్రంలో ఎవరికీ న్యాయం జరగలేదని విమర్శించారు. తెలంగాణలో ఒక కుటుంబం చేతుల్లోనే ముఖ్యమైన మంత్రిత్వ శాఖలు ఉన్నాయని, హైదరాబాద్ మినహా జిల్లాల్లో అభివృద్ధి జరగలేదని, పెట్టుబడులు రాలేదని ఎద్దేవా చేశారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని కేసీఆర్, కేటీఆర్ అంటున్నారు.. బీహెచ్ఈఎల్, ఐఐటీలు, విద్యాసంస్థలు, హరిత విప్లవం, భారీ ప్రాజెక్టులు ఉమ్మడి ఏపీలో ఏర్పాటు చేసింది కాంగ్రెస్ హయాంలోని ప్రభుత్వాలేనని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందన్నారు. ప్రజా తెలంగాణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తు అంబాసిడర్ కారుకు కాలం చెల్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల వలసలు తగ్గినట్లు ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. పార్లమెంట్ పరిశీలకులు మోహన్‌కుమార్ మంగళం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన

- 25న కొల్లాపూర్, 26న మక్తల్‌లో బీజేపీ బహిరంగసభలు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం కొల్లాపూర్, ఆదివారం మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించనున్న బహిరంగ సభల్లో పాల్గొంటారు. శనివారం ఉదయం 11.20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా కొల్లాపూర్ చేరుకొని 11.30 గంటలకు పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మునుగోడు ఎన్నికల ప్రచారానికి బయలుదేరి వెళ్తారు. ఆ తర్వాత ఆదివారం ఉదయం 11.20 గంటలకు హెలీకాప్టర్ ద్వారా మక్తల్‌కు వచ్చి.. 11.30 గంటలకు మక్తల్‌లో నిర్వహించనున్న పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని.. మధ్యాహ్నం 12.20 గంటలకు ములుగు ఎన్నికల ప్రచారానికి వెళ్తారు.

రేపు కౌన్సెలింగ్

బిజినేపల్లి: మండలంలోని పాలెం వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పీజీ తెలుగు కోర్సులో సీట్ల భర్తీకి ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విద్యారాణి గురువారం ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏంఏ తెలుగులో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. డిగ్రీలో 50శాతం మార్కులు కలిగి, ఆసక్తిగల వారు మూడు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్‌తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ప్రాసెసింగ్ ఫీజుగా రూ.2,100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

విధి నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు



అచ్చంపేట రూరల్: విధి నిర్వహణపై అలసత్వం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి సుధాకర్‌లాల్ హెచ్చరించారు. గురువారం అచ్చంపేటలోని ప్రాంతీయ ఆస్పత్రిలో డివిజన్ వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూట్రిషియన్ కిట్, కేసీఆర్ కిట్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఎన్‌సీడీ కార్యక్రమం అమలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. నిర్దేశిత లక్ష్యం సాధించాలని తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ తారాసింగ్, డీపీఓ రేణయ్య, అశోక్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేటినుంచి మంగళ కైశిక ద్వాదశి ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని పది ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మంగళ కైశిక ద్వాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూత్పూర్‌లోని మునిరంగస్వామి, మహబూబ్‌నగర్ మండలంలోని చౌదర్‌పల్లి సంజీవమూర్తి, మరికల్ మండలం ఇబ్రహీంపట్నంలోని మునిరంగస్వామి, ధన్వాడ మండలం గోటూర్ పోచమ్మ, బల్మూర్ మండలం తుమ్మన్‌పేటలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల చెన్నకేశవస్వామి, పాన్‌గల్ మండలం రాయినిపల్లి రామాలయం, వనపర్తి మండలం కడకుంట్ల ఆంజనేయస్వామి, వడ్డేపల్లి మండలం పైపాడ్ మునిరంగస్వామి, మానవపాడు మండలం బొంకూర్ చింతల మునిరంగస్వామి ఆలయాల్లో మంగళ కైశిక ద్వాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి

తాడూరు: పంటల సాగులో జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలని కేవీకే పాలెం శాస్త్రవేత్త డా. ఆదిశంకర్, డా. శ్రీశైలం సూచించారు. తాడూరు మండలం యాదిరెడ్డిపల్లిలో గురువారం కేవీకే పాలెం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో యాసంగి పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు హానికర రసాయన మందుల పిచికారీని అదుపులో ఉంచుకోవాలని తెలిపారు. అనంతరం మిరప, వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మిరప పంటలో ఎండు తెగులు, కాయ తొలుచు పురుగు, కాయకుళ్లు వంటి సమస్యల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. శ్రీధర్, ఏఈఓ ఫయాజ్, సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



మీ ఆలోచనలు ఎల్లప్పుడూ ఉన్నతంగా ఉండాలి. ఎందుకంటే మీ ఆలోచనలు మీ మాటల్లో ప్రతిబింబిస్తాయి.
- మహాత్మాగాంధీ

చీటీ లేదని ఆగం కావొద్దు!



ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఎల్‌ఓలు ఓటర్ చీటీలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఒకవేళ ఓటరు చీటీలు అందకుంటే ఆగం కావాల్సిన పని లేదు. ఓటరు చీటీ లేకపోయినా ఓటేసే అవకాశం ఉంది. ఎన్నికల రోజు బీఎల్‌ఓలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటారు. వారి వద్దకు వెళ్లి చీటీ లేని వారు ఆ రోజు కూడా ఓటరు చీటీ రాయించుకునే అవకాశం ఉంది. లేకపోతే ఓటరు జాబితాలో క్రమ సంఖ్య తెలుసుకుని పోలింగ్ ఏజెంట్లకు చెప్పి వారికి తానే సంబంధిత ఓటరునని నిరూపించుకునే గుర్తింపు కార్డును చూపి ఓటేయొచ్చు. లేదంటే పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసే ఓటరు జాబితాను పరిశీలించి పేరు, క్రమ సంఖ్యను కాగితంపై రాసుకుని వెళ్లవచ్చు. ఆ సమయంలో ఓటరు వద్ద తగిన గుర్తింపు కార్డును తప్పకుండా వెంట తీసుకెళ్లి పోలింగ్ కేంద్రంలో ఉండే అధికారులకు చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

- అడ్డాకుల

అభివృద్ధిలో అలం‘పూర్’

పేరు ఘనం.. ప్రగతి శూన్యం

- అనేక సమస్యలతో ప్రజలు సతమతం
- అసంపూర్తి పనులతో అవస్థలు
- ‘సాక్షి’ గ్రౌండ్ రిపోర్టులో పలు సమస్యలు వెలుగులోకి..

అలంపూర్: రాష్ట్ర సరిహద్దు నియోజకవర్గాల్లో అలంపూర్ ఒకటిగా చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలను కలుపుతూ రాష్ట్రీయ, జాతీయ రహదారులతో పాటు రెండు జీవనదులతో నిత్యం సందడిగా ఉంటోంది. రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. ఇంతటి ఘన కీర్తి గల అలంపూర్ సెగ్మెంట్.. అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని చెప్పవచ్చు. ప్రభుత్వం పలు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. నియోజకవర్గంలో అలంపూర్ మున్సిపాలిటీ, మండలం, ఎర్రవల్లి, ఉండవెల్లి, మానవపాడు, ఇటిక్యాల, రాజోళి, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీ, మండలాలు ఉన్నాయి. తుది ఓటర్ల జాబితా ప్రకారం 2,37,938మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,17,850 మంది, మహిళా ఓటర్లు 1,20,081 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు.



అలంపూర్‌లో పునాది దశలోనే సమీకృత మార్కెట్ నిర్మాణం

సాగునీటికి కష్టాలే..

అలంపూర్ నియోజకవర్గాన్ని అనుసరించి కృష్ణా, తుంగభద్ర జీవనదులు ఉన్నాయి. ఇక్కడ సారవంతమైన నల్లరేగడి, ఎర్రనేలలు ఉన్నాయి. నియోజకవర్గం రెండు జీవనదుల మధ్య ఉన్నా సాగునీటికి కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా ఆర్డీఎస్‌తో సాగునీటిని అందించడానికి కాల్వలను ఏర్పాటు చేశారు. అలంపూర్‌కు 15.9 టీఎంసీలు, కర్ణాటక ప్రాంతానికి 1.2 టీఎంసీల నీటిని కేటాయించారు. ఆర్డీఎస్‌తో 87,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, ప్రస్తుతం 20వేల ఎకరాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఆర్డీఎస్ ఆయకట్టులోని 55,595 ఎకరాలకు సాగునీరు అందించేందుకుగాను దాదాపు రూ.783కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించారు. మొదటి విడతలో పంప్‌హౌస్, ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్, డబుల్ లైన్‌తో కలుపుకొని 14 కి.మీ. మేర పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం నదిలో నీటి నిల్వలు లేకపోవడంతో సాగునీరు అందించడం సాధ్యం కావడంలేదు. తుమ్మిళ్ల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీటిని అందించడానికి మల్లమ్మకుంట, జూలకల్, వల్లూరు వద్ద రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మల్లమ్మకుంట నిర్మాణానికిగాను తుమ్మిళ్ల వద్ద మూడవ పైప్‌లైన్ 9.6 కి.మీ. అందుబాటులోకి రావాల్సి ఉంది. సెకండ్ ఫేస్‌లో రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.400 కోట్లతో ప్రతిపాదనలు పంపించగా, ప్రభుత్వం రూ.386 కోట్ల మేర పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ఇప్పటి వరకు మల్లమ్మకుంట పనులు ప్రారంభం కాలేదు. అదేవిధంగా నాగర్‌దొడ్డి, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ల ద్వారా పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. జూరాల ప్రాజెక్టుతో డీ–32, 38 పరిధిలోని చివరి ఆయకట్టు గల దువాసిపల్లె, వీరాపురం, కారుపాకుల, ఆర్.గార్లపాడు, ధర్మవరం గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందడంలేదు. ఇటిక్యాల మండలంలో చేపట్టాల్సిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ కాల్వల నిర్మాణ పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి.



ఉండవెల్లి మండలం బైరాపురం రోడ్డులో ముందుకు సాగని బ్రిడ్జి నిర్మాణం

నిర్వాసితులకు దక్కని పునరావాసం..

2009 ముంపు నిర్వాసితులకు ఇప్పటికీ పునరావాసం కల్పించలేదు. అలంపూర్‌లో పునరావాసం కోసం 2011లో 43.27 ఎకరాలు సేకరించి ముందు బాధితులకు పట్టాలిచ్చారు. అయితే లబ్ధిదారుల నుంచి పట్టాలు వెనక్కి తీసుకొని చేపట్టిన విచారణ ఇంకా కొలిక్కి రాలేదు. రాజోళిలో 212 ఎకరాలు సేకరించగా, పునరావాసం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, నసనూరు, మద్దూరు గ్రామాల్లో నిర్వాసితులకు పునరావాసంపై ఎవరూ దృష్టి సారించడంలేదు.



పునరావాస కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణం

మున్సిపాలిటీల్లో ఇదీ పరిస్థితి..

నియోజకవర్గంలో అలంపూర్, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీలు ఉన్నాయి. మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అయిజ మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ రుణంలో భాగంగా రూ.15 కోట్లు మంజూరు కాగా.. రూ.6కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశారు. రూ.9కోట్లతో ఆయా వార్డుల్లో చేపట్టిన సీసీరోడ్లు, బీటీరోడ్ల పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అలంపూర్ మున్సిపాలిటీ సుందరీకరణకు రూ.10కోట్లు కేటాయించగా, రూ.3.50 కోట్లతో డివైడర్ కం సెంట్రల్ లైటింగ్, రూ.1.50 కోట్లతో మున్సిపాలిటీ నూతన భవనం, రూ.5కోట్లతో సీసీరోడ్ల పనులు చేపట్టారు. ఇందులో కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయి. వడ్డేపల్లికి రూ.10కోట్లు కేటాయించగా, రూ.3.50 కోట్లతో డివైడర్ కం సెంట్రల్ లైటింగ్, రూ.5కోట్లతో సీసీరోడ్ల పనులు చేపట్టినా అసంపూర్తిగానే ఉన్నాయి. అలంపూర్, అయిజ మున్సిపాలిటీల్లో రూ.4కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్‌ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. మున్సిపాలిటీల్లో రింగ్‌రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు అటకెక్కాయి.

అధ్వానంగా ఉన్నాయి..



అయిజ మున్సిపాలిటీలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొత్త బస్టాండ్, పశు వైద్యశాల, ఆంజనేయస్వామి ఆలయం వద్ద ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. అనేక చోట్ల గోతులు ఏర్పడ్డాయి. రోడ్లు అధ్వానంగా మారినా మరమ్మతులు చేయడంలేదు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

- జమ్మన్న, అయిజ

ప్రయాణికుల ఇక్కట్లు



తెలంగాణ ఏర్పాటు తర్వాత సరిహద్దు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడంలేదు. కనీసం పెద్ద గ్రామాలకు కూడా బస్సులు వచ్చే పరిస్థితి లేదు. ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

- అబ్దుల్ రసూల్, గొందిమల్ల

అధ్వాన రోడ్లతో అవస్థలు..

గ్రామీణ రహదారులు ఆధునీకరణకు నోచుకోవడం లేదు. వడ్డేపల్లి మండలంలోని జూలకల్, కోయిల్‌దిన్నె, తనగల, పైపాడు గ్రామాల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మానవపాడు ప్రధాన రహదారి గుంతలమయంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు, సాతర్లకు వెళ్లే మార్గంలో వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అయిజ మండలంలోని ఏక్లాస్‌పురం, బింగిదొడ్డి, తూముకుంట, వెంకటాపురం, ఉప్పల, యాపదిన్నె, కుర్వపల్లి, జడుదొడ్డి గ్రామాల రోడ్లు మరమ్మతులకు నోచుకోవడంలేదు. రాజోళి ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి ఉన్నా బీటీరోడ్డు నిర్మాణం చేపట్టడంలేదు. అలంపూర్ మండలంలోని ర్యాంలపాడు, సుల్తానాపురం, జిల్లెలపాడు గ్రామాల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా ఫలితం లేకుండాపోయింది. ఆరేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పుల్లూరు, కలుకగోట్ల, మెన్నిపాడు గ్రామాల రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అలంపూర్‌లో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



బీటీకి నోచుకోని సుల్తానాపురం రోడ్డు

ఆర్టీసీ బస్సులు కరువు..

గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కరువైంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి గ్రామానికి రెండు నుంచి మూడు బస్సులు రాకపోకలు సాగించేవి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కర్నూల్ డిపో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. గద్వాల డిపో బస్సులు కూడా రావడం లేదు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న అలంపూర్ వంటి ప్రాంతంలో బస్సులు కనిపించని దుస్థితి నెలకొంది. ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆయా గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

వలస ఓటర్లపై ‘నజర్’

అడ్డాకుల: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో వలస ఓటర్లపై ప్రధాన పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. గ్రామాల్లో ఓటు హక్కు కలిగి ఉండి ఉపాధి కోసం హైదరాబాద్, ముంబాయి, బెంగళూర్ పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాలలో ఉండే ఓటర్ల వివరాలను నేతలు సిద్ధం చేశారు. ఇప్పటికే వారితో ఓసారి ఫోన్లలో టచ్‌లోకి వెళ్లారు. అధికార పార్టీ ఒక అడుగు ముందుకేసి ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఆత్మీయ సమ్మేళనాల పేరుతో వారికి దగ్గరయ్యే ప్రయత్నం చేసింది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఇప్పుడు వలస ఓటర్లపై నజర్ వేయడంతో వారు ఎటువైపు మొగ్గు చూపుతారన్నది నేతల్లో టెన్షన్‌కు కారణమవుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు వలస ఓటర్ల వివరాలను ప్రాంతాల వారీగా సేకరించి జాబితాలను తయారు చేసి వారితో టచ్‌లోకి వెళ్లడమే కాకుండా మచ్చిక చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వారికి సంబంధించిన బంధువులతో మాట్లాడిస్తూ తమ పార్టీ కే ఓటు వేయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. కొందరైతే వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఇక్కడి ప్రచారం ఫొటోలు, వీడియోలను వారికి పంపిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా కొందరిని వలస ఓటర్లు ఉండే చోటికి పంపిస్తున్నారు. ఈనెల 30న గ్రామాలకు వచ్చి ఓట్లు వేసి వెళ్లే విధంగా వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం నగదు, మద్యం ఇవ్వడానికి కూడా వెనుకాడటం లేదని సమాచారం. గతంలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలప్పుడు మాత్రమే వలస ఓటర్లను గ్రామాలకు తెప్పించే ప్రయత్నం చేసేవారు. 2018 సాధారణ ఎన్నిలకప్పుడు కూడా వలస ఓటర్లకు గ్రామాలకు రప్పించారు. మళ్లీ ఈసారి కూడా వలస ఓటర్లపై నేతలు దృష్టి సారించడంతో పోలింగ్ శాతం గతాని కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది.

గుర్తుతో పాటు ఫొటో



- సరికొత్తగా ఈవీఎంలు

మహబూబ్‌నగర్ రూరల్: ఓటర్లు గుర్తులను గుర్తించడంలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఈ సారి ఎన్నికల సంఘం సరికొత్తగా గుర్తుతో పాటు పోటీ చేసే అభ్యర్థి ఫొటో కూడా ఈవీఎంలో ఏర్పాటు చేస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఓటింగ్ విధానంలో కూడా పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేసేవారు. దాని స్థానంలో ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను వాడుతున్నారు. ఆ తర్వాత ఈవీఎంలకు అనుబంధంగా ఓటర్ వెరిఫిల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్) యంత్రాలను జోడించారు. ఈసారి ఎన్నికల్లో ఈవీఎంలపై అభ్యర్థికి కేటాయించిన గుర్తుతో పాటు సదరు అభ్యర్థి ఫొటోలను కూడా ఉంచనున్నారు

అభ్యర్థి ఫొటో కూడా..

ఇప్పటి వరకు ఈవీఎంలలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లు కలిపి ఉంటాయి. బ్యాలెట్ యూనిట్‌పై గతంలో అభ్యర్థి పేరు, అతనికి కేటాయించిన గుర్తు మాత్రమే ఉండేవి. ఈసారి ఎన్నికల్లో బ్యాలెట్ యూనిట్‌పై అభ్యర్థి ఫొటోను కూడా ఉంచనున్నారు. దీంతో ఓటరు గుర్తు విషయంలో ఇబ్బంది పడితే అభ్యర్థి ఫొటో చూసి తాను ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకోవచ్చు.

తొలిసారిగా 1982లో..

ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం, భద్రపర్చడం ఖర్చు, శ్రమతో కూడుకున్న వ్యవహారం కావడంతో వీటికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యాంత్రాల(ఈవీఎం)ను ఉపయోగించాలనే ఆలోచన 1979లో చేశారు. తొలుత వీటిని ఐఐటీ బాంబే, ఇండ్రస్ట్రీయల్ డిజైన్ సెంటర్ వారు సంయుక్తంగా తయారు చేశారు. వీటిని తొలిసారిగా కేరళలో 1982 అసెంబ్లీ ఎన్నికల్లో నార్త్ పరవూర్ నియోజకవర్గంలో కొన్ని పోలింగ్ బూత్‌లలో ప్రయోగాత్మకంగా వినియోగించారు. మంచి ఫలితాలు రావడంతో వీటి తయారీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఈసీఐఎల్, బీహెచ్‌ఎల్ సంస్థలకు అప్పగించారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని ఈసీఐఎల్, బెంగళూరులోని బీహెచ్‌ఎల్ కంపెనీలు. దేశం మొత్తానికి అవసరమైన ఈవీఎంలను తయారు చేస్తున్నాయి.

2004 నుంచి దేశవ్యాప్తంగా..

1999, 2001లో వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఈవీఎంలను ఎన్నికల సంఘం ఉపయోగించింది. 2004 నుంచి అన్ని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను వంద శాతం వినియోగిస్తూ వస్తున్నారు. ఈవీఎంల పనితీరుపై దేశంలోని పలు రాజకీయ పార్టీలు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈవీఎంలకు అనుబంధంగా వీవీ ప్యాట్లను తీసుకొచ్చారు. ఓటరు ఈవీఎంపై వేసిన ఓటు స్లిప్ రూపంలో వీవీ ప్యాట్ బాక్స్ లో పడుతుంది. ఒకవేళ కౌంటింగ్ సమయంలో ఈవీంఎం ఓపెన్ కాకపోయినా, రీకౌంటింగ్ కావాలని ఎవరైనా అభ్యర్థి అడిగితే వీవీ ప్యాట్‌లో ఉన్న స్లిప్పులను లెక్కిస్తారు.

సరికొత్తగా అమలు..



ఈ సారి ఎన్నికల సంఘం ప్రయోగాత్మకంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి పార్టీకి చెందిన గుర్తుతోపాటు పోటీ చేసే అభ్యర్థి ఫొటోను కూడా ఏర్పాటు చేస్తున్నాం. దీంతో ఓట్లకు ఎలాంటి తికమక లేకుండా ఉంటుంది.

- అనిల్ కుమార్, మహబూబ్‌నగర్ రిటర్నింగ్‌అధికారి

64 మంది వరకు..

ఒక్కో ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థులకు సంబంధించిన గుర్తులను ఏర్పాటు చేయవచ్చు. ఇలా నాలుగు ఈవీఎంలను ఒక కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానించవచ్చు. అంటే ఒక కంట్రోల్ యూనిట్ 64 గుర్తుల వరకు మాత్రమే అమర్చడానికి వీలవుతుంది. అంతకు మించి అభ్యర్థులు పోటీ పడితే అక్కడ బ్యాలెట్ పేపర్ వాడాల్సి ఉంటుంది. ఒక్క ఈవీఎంలో గరిష్ఠంగా 3,840 ఓట్ల వరకు నమోదవుతాయి. ఓటరు తాను వేసిన ఓటును ఓటింగ్ యంత్రంపై 7 సెకన్ల పాటు చూసుకోవచ్చు. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓటు 10 సంవత్సరాల వరకు భద్రంగా ఉంటుంది.

ఎన్నికల సిత్రాలు..

నేను దరువేస్తా.. మీరు ఓటేయండి..



కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి పీపనగండ్ల మండలం సంపత్రావుపల్లిలో డోలు వాయిస్తూ దరువులు వేశారు. కారుకు ఓటేయండి అంటూ ఉత్సాహపరిచారు. - కొల్లాపూర్

మద్దతుగా ఉన్నా.. మీ ఓటు కారుకే..



ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కోస్గి పట్టణంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పర్యటించారు. ఈ క్రమంలో ఓ దుకాణంలో ఇస్త్రీ చేసి, మరోచోట మీకు మద్దతుగా ఉన్న కారుకే వేయాలంటూ వృద్ధురాలితో మాట్లాడారు. - కోస్గి

డప్పుకొట్టు.. ఓట్లు పట్టు..



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూర్ మండలంలోని కత్తేపల్లిలో మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి డప్పు వాయించి కార్యకర్తల్లో జోష్ తీసుకొచ్చారు. ఓట్లు దండిగా పడాలని ఓటర్లను అభ్యర్థించారు. - ఆత్మకూర్

ఉండన్న బొట్టు పెడతా..



ఊట్కూర్ మండలం లక్ష్మింపల్లిలో మక్తల్ బీజేపీ అభ్యర్థి జలందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేసేందుకు వెళ్లగా బొట్టుపెట్టి మంగళహరతితో ఆశీర్వదించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. - మక్తల్

మీకెందుకు శ్రమ.. మేం రొట్టె కాలుస్తాం



పాన్‌గల్ మండలం శాగాపూర్‌తండాలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓ మహిళ వద్దకు వెళ్లి రొట్టెను పెంకుపై కాల్చుతూ కారుకు ఓటెయ్యాలని కోరారు. - పాన్‌గల్

బొట్టు పెట్టి చెబుతున్నా..



చిన్నచింతకుంట మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తరఫున సతీమణి ఆల మంజుల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటికి వచ్చిన ఆడపడుచును మహిళలు బొట్టు పెట్టి ఆదరించారు. - చిన్నచింతకుంట

ఆదరించి... ఆశీర్వాదిస్తూ..



మరికల్ మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పర్ణికారెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. - నారాయణపేట

హలో.. 1950

- ఓటర్ల అనుమానాల నివృత్తికి సహాయక కేంద్రం



గద్వాల పట్టణంలోని ఐడీఓసీ కార్యాలయంలో ఓటరు సహాయక కేంద్రం

గద్వాల అర్బన్: హలో కంట్రోల్ రూం అంటే ఇది వరకైతే పోలీసు కంట్రోల్ రూం అని ప్రజలు భావించేవారు. అసెంబ్లి ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల అనుమానాలను నివృత్తి చేసేందుకు గద్వాల పట్టణంలోని ఐడీఓసీ కార్యాలయంలో ‘ఓటరు సహాయక కేంద్రం’ ఏర్పాటు చేశారు. టోల్‌ఫ్రీ 1950నంబర్‌కు కాల్ చేసి ఓటరు జాబితాలో తమ పేరు ఉందా? లేదా? ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది. బూత్ లెవల్ అధికారుల ఫోన్ నంబర్లు తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం దీనిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది 24గంటలు పని చేస్తుంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
24-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
5	10
66,018	19,802

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,266	△	66
డోజోన్స్	35,273	▽	185
ఎఫ్‌టీఎస్ఈ 100	7,484	△	14
డాక్స్	15,995	△	37
హాంగ్‌సెంగ్	3,062	△	18
నికాయ్	33,452	△	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,394	▽	222
బంగారం (99.5 స్వచ్ఛత)	61,148	▽	221
వెండి (కిలో)	73,065	▽	400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	102.55	105.90
€	యూరో	ఒకటికి	89.35	92.43
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	62.71	64.78
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	53.43	55.78
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.81	63.86
SAR	సౌదీ రియాల్	ఒకటికి	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటికి	21.79	23.59
¥	చైనా యువాన్	ఒకటికి	10.55	12.62

ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం

- డిసెంబర్‌లో ఎల్‌ఐసీ కొత్త ప్లాన్
- మూడు–నాలుగు కొత్త పాలసీలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు వరకు నూతన పాలసీలను ఆవిష్కరించనుంది. నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఉంది. ''గతేడాదితో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధిస్తాం. ఎందుకంటే ఇండివిడ్యువల్ రిటైల్ వ్యాపారం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నాం''అని ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఎల్‌ఐసీ ఒక ఉత్పత్తిని తీసుకువస్తుందని వెల్లడించారు. దీనితో మార్కెట్లో మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్‌లో తెచ్చే నూతన పాలసీ గురించి వివరిస్తూ.. పాలసీ మెచ్యూరిటీ తర్వాత (గడువు ముగిసిన అనంతరం) జీవితాంతం ఏటా సమ్ అష్యూర్డ్‌లో (బీమా కవరేజీలో) 10 శాతం చొప్పున లభిస్తుందని తెలిపారు. ఇది మార్కెట్లో సంచలనాన్ని సృష్టిస్తుందన్నారు. 20–25 ఏళ్ల తర్వాత ఎంత చొప్పున వస్తుంది, ఎంత ప్రీమియం చెల్లించాలన్నది తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌పై రుణ సదుపాయం, ముందస్తు ఉపసంహరణకూ అవకాశం ఉంటుందన్నారు. హామీతో కూడిన రాబడులు ఇచ్చే పాలసీలకు పాలసీదారులు, వాటాదారులు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతూ.. తమ కంపెనీ వాటాదారుల్లో చాలా మంది పాలసీదారులుగా ఉన్నట్టు మహంతి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) నూతన వ్యాపార ప్రీమియం (ఇండివిడ్యువల్) 2.65 శాతమే వృద్ధి చెంది రూ.25,184 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

అమెజాన్‌తో వాణిజ్య శాఖ ఒప్పందం

చిన్న సంస్థలకు ఎగుమతులపై శిక్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా 20 జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) శిక్షణ కల్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. దీని ప్రకారం ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ఇమేజింగ్, డిజిటల్ క్యాటలాగ్‌లను రూపొందించడం, పన్నుల సంబంధమైన అంశాలను తెలుసుకోవడం మొదలైన వాటికి ఈ శిక్షణ ఉపయోగపడగలదని పేర్కొంది. ఎగుమతుల హబ్‌లుగా గుర్తించిన జిల్లాల్లో అమెజాన్, డీజీఎఫ్‌టీ కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాల కోసం ఫ్లిప్‌కార్ట్, ఈబే, రివెక్స్, షిప్‌రాకెట్, షాప్‌క్లూస్ వంటి వివిధ ఈ–కామర్స్ సంస్థలతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) చర్చలు జరుపుతున్నట్లు వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశీ సంస్థలు అంతర్జాతీయంగా మరిన్ని ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. 2030 నాటికి ఈ–కామర్స్ ద్వారా 350 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఇవి 2 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ఎగుమతులను సరళతరం చేయడం, 2025 నాటికి ఈ–కామర్స్ ఎగుమతులను 20 బిలియన్ డాలర్లకు చేర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు.

ఇరెడా ఐపీవో సక్సెస్



చివరి రోజుకల్లా 39 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్ఈడీఏ–ఇరెడా) పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు గురువారానికల్లా 39 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 47 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 1,827 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 24 రెట్లు, రిటైలర్ల నుంచి దాదాపు 8 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో అయితే దాదాపు 105 రెట్లు అధికంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 30–32 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూలో భాగంగా సోమవారం(20న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 643 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

ఈక్విటీ వివరాలిలా

ఐపీవోలో భాగంగా 40.31 కోట్ల ఈక్విటీ షేర్లను ఇరెడా తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వం 26.88 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఈక్విటీ జారీతో రూ. 1,290 కోట్లు, ప్రభుత్వ వాటాకు రూ. 860 కోట్ల చొప్పున లభించనున్నాయి. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 2,150 కోట్లు సమకూర్చుకోనుంది. గతేడాది మే నెలలో బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ లిస్టింగ్ తదుపరి మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థ పబ్లిక్ ఇష్యూకి రావడం విశేషం! కాగా.. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ భవిష్యత్ పెట్టుబడి అవసరాలరీత్యా మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ప్యూర్ ఈవీ నుంచి ఎకోడ్రిఫ్ట్ బైక్

ధర రూ. 1,29,999



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తమ కొత్త మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని ఆవిష్కరించింది. దీన్ని ఒక్కసారి చార్జి చేస్తే 171 కి.మీ. వరకు ప్రయాణించగలదు. ప్రతి రోజూ ఎక్కువ దూరాలు ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. దీనితో నెలవారీగా రూ. 7,000 పైచిలుకు ఆదా కాగలదని వివరించింది. దీని ధర రూ. 1,29,999గా ఉంటుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు. సులభతరమైన ఈఎంఐ సదుపాయం రూ. 4,000 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. 110 సీసీ సెగ్మెంట్‌లో హీరో స్ప్లెండర్, హోండా షైన్, బజాజ్ ప్లాటినా వంటి మోటార్‌సైకిల్స్‌తో దీటుగా పోటీపడగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. ఇందులో రివర్స్ మోడ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, డౌన్ హిల్ అసిస్ట్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 75 కి.మీ. గరిష్ట వేగంతో ప్రయాణించగలదు.

ఫేమ్ ఉల్లంఘనలపై విచారణ

నెల రోజుల్లో నివేదిక; తర్వాత చర్యలు



న్యూఢిల్లీ: ఫేమ్–2 స్కీము నిబంధనల ఉల్లంఘనలో అధికారులపరంగా తప్పిదాలు జరిగాయన్న ఆరోపణలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. వాటితో పాటు వేలిడేషన్, టెస్టింగ్ ఏజెన్సీలైన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) అధికారుల పాత్రపైనా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విచారణ ప్రారంభించింది. దీనికి సంబంధించి నెల రోజుల వ్యవధిలో నివేదిక రావచ్చని శాఖ కార్యదర్శి కమ్రాన్ రిజ్వి తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలకు బాధ్యులైన వారితో పాటు సిస్టమ్స్‌ను కూడా సరిదిద్దే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానికంగా తయారీని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇచ్చేలా కేంద్రం రూ. 10,000 కోట్లతో ఫేమ్–2 స్కీమును ప్రవేశపెట్టింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పలు కంపెనీలు పెద్ద స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయని, ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సాహకాలు పొందాయని ఆరోపణలొచ్చాయి.

ఆచితూచి రుణాలివ్వండి..!

- ఎన్‌బీఎఫ్‌సీలకు కేంద్ర ఆర్థిక మంత్రి సూచన
- అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హితవు



డేటా సురక్షితం

అకౌంట్ అగ్రిగేటర్లతో (ఏఏ) పంచుకునే కస్టమర్ల డేటా దేశంలో పూర్తి సురక్షితంగా ఉంటుందని మంత్రి సీతారామన్ హామీనిచ్చారు. డేటా భద్రత విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు. ''అకౌంట్ అగ్రిగేటర్లు డేటా బ్యాంక్ కలిగి ఉంటారనే అభిప్రాయాలు ఉండేవి. నిజానికి వారు డేటా కలిగి ఉండరు. వారి ద్వారా డేటా బదిలీ అవుతుంది. ఏఏ ద్వారా బ్యాంక్ కానీ, కస్టమర్ కానీ డేటా కలిగి ఉండరు. కేవలం రుణాల మంజూరీకే దీన్ని వినియోగించుకుంటారు''అని మంత్రి చెప్పారు.

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ సూచించిన విధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు రుణ వితరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎర్రటి గీతను (హద్దులను/పరిమితులను) గౌరవించాలని, అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరించరాదని కోరారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్‌కార్డ్ రుణ విభాగంలో (అన్‌సెక్యూర్డ్) బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గడిచిన కొన్నేళ్లలో భారీ వృద్ధిని చూపిస్తుండడం తెలిసిందే. ఫలితంగా ఈ విభాగంలో ఎన్‌పీఏలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రిస్క్ నియంత్రణకు గాను ఆర్‌బీఐ ఇటీవలే నిబంధనలు కఠినతరం చేయడం తెలిసే ఉంటుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డ్‌ల రుణాలకు గాను రిస్క్ వెయిటేజీని 0.25 శాతం మేర పెంచింది. దీనివల్ల బ్యాంకుల వరకే రూ.84,000 కోట్లను అదనంగా పక్కన పెట్టాల్సి రావచ్చని అంచనా. 'డేట్ విత్ టెక్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఉత్సాహం మంచిదే. కానీ, కొన్ని సందర్భాల్లో ఇదీ మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం. దీంతో జాగ్రత్తగా ఉండాలని, దూకుడుగా వ్యవహరించడం ద్వారా తర్వాత రిస్క్‌లు చవిచూడొద్దన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.

ఆరంభ లాభాలు ఆవిరి..



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 5 పాయింట్లు నష్టపోయి 66,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్లు పతనమై 19,802 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, రియల్టీ, టెలికం, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''నిఫ్టీ 19,800 స్థాయిని దాటి ముందుకెళ్లేందుకు ప్రోత్సాహానిచ్చే కీలక పరిణామాలేవీ లేకపోవడంతో పరిమిత శ్రేణి ట్రేడింగ్ రెండోరోజూ కొనసాగింది. క్రూడాయిల్ ధరలు, బాండ్లపై రాబడులు దిగిరావడం వంటి అంశాలు దేశీయ మార్కెట్ పతనాన్ని అడ్డుకుంటున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్సియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల రష్మిక 4–6, 7–5, 7–5తో నాలుగో సీడ్ వైదేహి (గుజరాత్)ను ఓడించింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి (భారత్) జోడీ 6–0, 6–3తో కశిష్ భాటియా–వన్షిత (భారత్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన యడ్లపల్లి ప్రాంజల పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రాంజల 4–6, 3–6తో రుతుజా భోస్లే (భారత్) చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్ ముందంజ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–18తో మాగ్నస్ జొహాన్‌సెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–15, 21–16తో అకీరా కొగా–తైచి సైటో (జపాన్) జంటపై గెలిచింది.

రన్నరప్ హారిక



సాక్షి, హైదరాబాద్: జూలియస్ బేర్ అంతర్జాతీయ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక రన్నరప్‌గా నిలిచింది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్‌తో జరిగిన ఫైనల్లో హారిక 11–15 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. విజేతగా నిలిచిన హు ఇఫాన్‌కు 15,769 డాలర్లు (రూ. 13 లక్షల 13 వేలు), రన్నరప్ హారికకు 4,230 డాలర్లు (రూ. 3 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఐపీఎల్‌కు స్టోక్స్ దూరం



చెన్నై: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి వైదొలిగాడు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ కంటే ముందు భారత జట్టుతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూన్‌లో టి20 వరల్డ్‌కప్ ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో స్టోక్స్ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. స్టోక్స్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ. 16 కోట్ల 25 లక్షలకు తీసుకోగా అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి మోకాలి గాయంతో మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

ఆఖరి బంతికి గట్టెక్కాం

- ఉత్కంఠపోరులో భారత్ విజయం
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్
- రాణించిన ఇషాన్, రింకూ సింగ్
- తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి
- ఇన్‌గ్లిస్ సెంచరీ వృథా
- 26న రెండో టి20 మ్యాచ్


సూర్య


జోష్ ఇన్‌గ్లిస్

సాక్షి, విశాఖపట్నం: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో చివరికి భారత జట్టుదే పైచేయిగా నిలిచింది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి డాక్టర్ వైఎస్ఆర్–ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. తొలిసారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు సాధించింది. జోష్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. ఇన్‌గ్లిస్ 47 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఆరోన్ ఫించ్ (47 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. అనంతరం భారత జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)– అర్ధ సెంచరీలతో అదరగొట్టగా... రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఒక పరుగు అవసరంకాగా... సీన్ అబాట్ వేసిన బంతిని రింకూ సింగ్ సిక్సర్‌గా మలిచి భారత విజయాన్ని ఖరారు చేశాడు. అయితే టీవీ రీప్లేలో అబాట్ వేసిన బంతి నోబాల్ అని తేలడంతో అక్కడే భారత విజయం ఖాయమైంది. దాంతో రింకూ సింగ్ సిక్స్‌ను లెక్కలోకి తీసుకోలేదు. టి20ల్లో భారత జట్టుకిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. సిరీస్‌లోని రెండో టి20 మ్యాచ్ ఈనెల 26న తిరువనంతపురంలో జరుగుతుంది.

సూర్య, ఇషాన్ ధనాధన్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో సమన్వయలోపం కారణంగా మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి ఆడకుండానే తొలి ఓవర్లోనే రనౌటయ్యాడు. అనంతరం మూడో ఓవర్లో యశస్వి భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ జత కలిశారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకుండా ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో భారత్ స్కోరు 4.5 ఓవర్లలో 50 దాటింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 2 వికెట్లకు 63 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా ఇషాన్, సూర్య జోరు కొనసాగించడంతో భారత్ 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇషాన్ 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించి డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో షార్ట్ చేతికి చిక్కడంతో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ (10 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ దశలో సూర్య, రింకూ జతకలిసి ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో భారత్ 194/4తో విజయానికి చేరువైంది. అయితే ఇదే స్కోరు వద్ద సూర్య అవుటయ్యాడు. అప్పటికి భారత్ విజయానికి చేరువైంది.

చివరి ఓవర్ డ్రామా...

12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్లో భారత్ 7 పరుగులు చేసింది. దాంతో చివరి ఓవర్లో భారత్ గెలుపునకు 6 బంతుల్లో 7 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే రింకూ ఫోర్ కొట్టాడు. రెండో బంతికి 'బై' రూపంలో పరుగు వచ్చింది. 4 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన దశలో భారత్ వరుసగా మూడు బంతుల్లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ వికెట్లను కోల్పోయింది. రెండో పరుగు పూర్తి చేసే క్రమంలో అర్ష్‌దీప్ అవుటయ్యాడు. దాంతో చివరి బంతికి భారత్ విజయానికి ఒక పరుగు అవసరమైంది. 'సూపర్ ఓవర్' అవసరం పడుతుందా అనే అనుమానం కలిగిన దశలో అబాట్ వేసిన ఆఖరి బంతిని రింకూ సిక్స్‌గా మలచడంతో భారత విజయం ఖరారైంది. అయితే అబాట్ బంతి నోబాల్ అని తేలడంతో రింకూ సిక్స్ షాట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.



ఇషాన్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్టీవ్ స్మిత్ (రనౌట్) 52; మాథ్యూ షార్ట్ (బి) రవి బిష్ణోయ్ 13; జోష్ ఇన్‌గ్లిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ప్రసిధ్ కృష్ణ 110; స్టొయినిస్ (నాటౌట్) 7; టిమ్ డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 208. వికెట్ల పతనం: 1–31, 2–161, 3–180. బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4–0–41–0, ప్రసిధ్ కృష్ణ 4–0–50–1, అక్షర్ పటేల్ 4–0–32–0, రవి బిష్ణోయ్ 4–0–54–1, ముకేశ్ కుమార్ 4–0–29–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) షార్ట్ 21; రుతురాజ్ గైక్వాడ్ (రనౌట్) 0; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) తన్వీర్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆరన్ హార్డీ (బి) బెహ్రన్‌డార్ఫ్ 80; తిలక్ వర్మ (సి) స్టొయినిస్ (బి) తన్వీర్ సంఘా 12; రింకూ సింగ్ (నాటౌట్) 22; అక్షర్ పటేల్ (సి అండ్ బి) సీన్ అబాట్ 2; రవి బిష్ణోయ్ (రనౌట్) 0; అర్ష్‌దీప్ సింగ్ (రనౌట్) 0; ముకేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 209. వికెట్ల పతనం:** 1–11, 2–22, 3–134, 4–154, 5–194, 6–207, 7–207, 8–208. **బౌలింగ్:** స్టొయినిస్ 3–0–36–0, బెహ్రన్‌డార్ఫ్ 4–1–25–1, షార్ట్ 1–0–13–1, సీన్ అబాట్ 3.5–0–43–1, నాథన్ ఎలిస్ 4–0–44–0, తన్వీర్ సంఘా 4–0–47–2.

సామ్యూల్స్‌పై ఆరేళ్ల నిషేధం



దుబాయ్: అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆరేళ్ల నిషేధం విధించింది. 2019లో అబుదాబిలో జరిగిన టి10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లబ్ధి పొందాడని... ఎన్నిసార్లు అతడిని విచారించినా వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. 42 ఏళ్ల సామ్యూల్స్ 2012, 2016లలో టి20 ప్రపంచకప్ సాధించిన వెస్టిండీస్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 2008లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడటంతో రెండేళ్ల నిషేధానికి గురైన సామ్యూల్స్ వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు (3917 పరుగులు; 41 వికెట్లు), 207 వన్డేలు (5606 పరుగులు; 89 వికెట్లు), 67 టి20 మ్యాచ్‌లు (1611 పరుగులు; 22 వికెట్లు) ఆడాడు.

హైదరాబాద్ బోణీ


రాహుల్

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణిపూర్ సరిగ్గా 50 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ (3/71), రక్షణ్ రెడ్డి (2/28), తనయ్ త్యాగరాజన్ (2/24) రాణించారు. అనంతరం హైదరాబాద్ కేవలం 29.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి నెగ్గింది. హైదరాబాద్ కెప్టెన్ గౌహత్ రాహుల్ సింగ్ (47 బంతుల్లో 70; 13 ఫోర్లు), చందన్ సహని (32 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

ఆంధ్ర పరాజయం

మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర జట్టు పరాజయంతో ఈ టోర్నీని ప్రారంభించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 47.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (59 బంతుల్లో 47; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనీశ్ గోలమారు (60 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసి విజయం సాధించింది. అమిత్ (78 నాటౌట్; 11 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట్ (53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.